# తలవని తలపని కస్తూరి

"ఆటో - బాడుగకు వస్తావా ?"

సన్నగా తుప్పర పడుతున్నది. తలమీద చేతులు పెట్టుకుని రెండుసార్లు అడిగాడు పుండరి.

"ఎక్కడికి ?" చదువుతున్న పుస్తకం మూసి తలెత్తాడు డ్రైవరు.

"రామకృష్ణాపురం బస్టాండు దగ్గరికి."

"చాలాదూరం. వచ్చేటప్పుడు ఊరికే రావాలి. మీటర్‌మీద రెండురూపాయ లివ్వండి." డ్రైవరు మళ్ళీ పుస్తకం తెరిచాడు.

"అటువైపు ఆటోలున్నాయి రండి" తల తడవకుండా కొంగు కప్పు కుంటూ నసుగుతూ కస్తూరి రోడ్డు దాటింది.

తుప్పర వర్షంలోకి దిగింది. వెంకటరమణ థియేటరు ముందర వచ్చేజనం పోయేజనం. రద్దీ ఎక్కువవుతున్నది. చీరెలు తడిసిపోతున్నాయని థియేటరు వరండాలోకి పరుగులుతీస్తున్నారు స్త్రీలు. థియేటరులోనుంచి బైటికి వచ్చినవాళ్లు రిక్షాలకోసం, ఆటోలకోసం ఉరుకులు పెడుతున్నారు.

దారినపొయ్యే జనమ్మీద బురదచిమ్ముకుంటూ కార్లు దూసుకుపోతున్నాయి.

పుండరి మళ్ళీ మొదటి ఆటోదగ్గరికి వచ్చాడు.

"మీరు ఇంతకుముందు ఒకసారి అడిగారు. నేనడిగింది మీటరుమీద రెండు రూపాయలు. అదికూడా చాలా తక్కువ. చదువుతున్న పుస్తకాన్ని సొరుగులోకి నెట్టాడు డ్రైవరు.

పుండరి చేతిసైగ చెయ్యగానే కస్తూరి ఆటో ఎక్కింది. పుండరి అమ్మయ్య అనుకున్నాడు.

పెద్ద చప్పుడుతో వాహనాలమధ్య చోటుచేసుకుంటూ - మాట్లాడుకుంటూ రోడ్డుకు మధ్యగా నడిచే జనాన్ని తప్పించుకుంటూ- సాగిపోతున్నది ఆటో.

బస్సులు కంటికి కనపడినప్పుడల్లా పుండరి మనసు ఉసూరుమంటున్నది. ఎంతసేపు నిలబడినా రామకృష్ణాపురం వైపు వెళ్ళే బస్సు రాలేదు. ఇంకాకొంచెం సేపు నిలబడితే అందేదేమోనన్న ఆశ అతడి మనసులోనుంచి పోలేదు. సినిమా టికెట్లకంటె రాకపోకల ఖర్చు మించిపోయిందన్న బాధవల్ల ఆ చిత్రం చూసిన ఉత్సాహం నీరుకారినట్లవుతోంది.

కస్తూరిని 'ఆమెకన్నీరు' చిత్రంలో కథానాయిక పడ్డ బాధలు మనసును కలచివేస్తున్నాయి, 'ఆమె కన్నీరు' జీవితమంతా కారుతూనే ఉంది, ఆమె జీవితమంతా కార్చిన కన్నీరు కస్తూరి మూడుగంటలసేపు చూడలేకపోయింది. ఆమె కన్నీటిని తుడిచేవారెవరూ లేరు. 'అయ్యోపాపం' అనేవారేకాని ఆమె కన్నీటిని తుడిచే సాహసం ఎవరికీ లేదా ? సంస్కర్తలూ-అభ్యుదయవాదులూ - సామాజిక స్పృహగలవారూ-పురోగాములూ ఎవరూ లేరా? ఉంటే ముందుకు రారేం? అయితే ఈ సమస్యకు పరిష్కారమార్గమే లేదా ?

కస్తూరి మనసు సుళ్లుతిరుగుతున్నది. పరిష్కారమార్గం చూపలేనివాళ్లు ప్రజానీకానికి అటువంటి సమస్యను కళ్ళకు కట్టినట్టు ఎత్తిచూపించి ఏం ప్రయోజనం ?

సమస్య అర్థమవుతోంది. కాని పరిష్కారం లభించదు. ప్రేక్షకులకు కప్పదాటు స్వభావం కలగటానికి కారణమవుతోంది.

సృష్టిలోని స్త్రీలందరిమీదా ఒకవిధమైన జాలీ-ఏవగింపూ కలుగుతున్నాయి. అటువంటి పరిస్థితులు ఎదురయినవాళ్ళ జీవితాలు ఇంతేనా అనిపిస్తోంది. తప్పెవరిది ? ఎవరు బాధ్యులు ? ఈ ప్రశ్నలకు సమాధానాలుండవా ?

తనతల్లి స్త్రీ. తను స్త్రీ. తనబిడ్డ స్త్రీ. సృష్టికి మూలం స్త్రీ.

కస్తూరి మనసు బాధతో బరువెక్కుతున్నది.

తడిసి కుచ్చులు కుచ్చులుగా ముఖమ్మీద పడుతున్న తలవెంట్రుకలను పైకి తోసుకుంటూ రేపటి సంగతిని గురించి ఆలోచిస్తున్నాడు పుండరి. వెధవ జీవితాలు. నెలకొక సినిమా చూస్తేనే బడ్జెటు తల్లక్రిందులవుతుంది. ఇవాళ

పదిహేనో తారీకు. ఈ నెలయ్యేలోపల మరేదయినా ఖర్చు వస్తే పరిస్థితి చెయ్యి జారిపోతుంది.

'కస్తూరీ కస్తూరీ.' నిద్రమత్తులో ఉన్నట్టుందని ఆమెను కుదిపాడు.

"నిద్రపోవటంలేదు" ఆమె కెందుకో విసుగ్గా ఉంది.

"సినిమా చూడాలనుకుంటున్నావేమోనని తీసుకెళ్ళాను. వచ్చేటప్పుడున్న ఉత్సాహం ఇప్పుడు కనబడటంలేదు."

"ఏముంటుంది అటువంటి సినిమా చూస్తే ?"

"సినిమాచూసి ఏడవటం, విచారపడటం నీ అటువంటి ప్రేక్షకుల వంతు. కన్నీళ్ళతో కొంగులు తడిసిపోతాయి. మహిళా ప్రేక్షకుల మన్ననలందుకొన్న చిత్రమని నిర్మాతలు డబ్బు బాగా సంపాదిస్తారు. మీరెంతబాగా ఏడిస్తే వాళ్ళ కంత డబ్బు అధికంగా వస్తుంది" సర్దుకుని కూర్చున్నాడు పుండరి.

ఆటోలోనుంచి సన్నటి కూనిరాగం "దొరకునా ఇటువంటి సేవ...."

కస్తూరి మనసులో సుడిగుండాలు తిరుగుతున్నా ఆమె చెవిలో ఆ ఇంపైన కూనిరాగం బిత్తరపోయేటట్టు చేసింది. ఇదెక్కడినుంచి? 'దొరకునా ఇటువంటి సేవ' ఆ రాగచ్ఛాయలో కూనిరాగం? ఉలిక్కిపడ్డది.

పుండరి ఆటోరొదలో కూడా వినబడే ఈ కూనిరాగం ఎక్కడిదా అన్నట్లు తల బయటపెట్టి చూస్తున్నాడు.

ఒళ్లు జలదరించినట్టుగా నిటారుగా కూర్చుంది కస్తూరి.

ఆటో దిల్‌షుక్‌నగర్ దాటుతోంది.

గొంతు సవరించుకున్న చప్పుడు. మళ్ళీ ఇంకో పాట అందుకున్నట్టు రాగం మారింది.

"శంకరాభరణంలోది కదూ ఈ పాట?" బైటికి అనేశాడు పుండరి.

అప్పుడే నిద్రలోనుంచి లేచినట్టుగా ఆఁ ఆఁ అంటోంది కస్తూరి. భయమావహించినట్టుగా ముడుచుకుపోయింది.

రామకృష్ణాపురం బస్టాండుదగ్గర ఆటో టక్కున ఆగింది.

దానితోపాటు పాట కూడా ఆగింది. పుండరి దిగినతరువాత కస్తూరి దిగింది. వర్షం వెలిసి గాలివీస్తోంది మందంగా.

పుండరి మీటరు చూడటానికి డ్రైవరు చిన్న టార్చిని వెలిగించి చూపించాడు డ్రైవరు డబ్బుతీసుకుంటుండగా కస్తూరి డ్రైవర్ని మరొకసారి పరీక్షగా చూసింది. ఆ కంఠధ్వని ఎక్కడో ఎప్పుడో విన్నట్టుగా ఉంది ఆమెకు. పుండరి కాళ్ళుకడుక్కుని వచ్చేంతలోపు కస్తూరి పక్కలు సరిసేసి తన పక్కమీద పడుకుంది.

"భోజనం చేద్దాంరా" పిలిచాడు.

పీటవేసి అన్నీ పళ్లెందగ్గర పెట్టాను. మీరు భోజనం చేయండి.

"మరి నీవు ?"

"నాకు తినాలని లేదు. వికారంగా ఉంది" పక్కకు తిరిగి పడుకుంది.

"నీవు కొంతకాలం సినిమాలు చూడటం మానెయ్యి. సినిమా చూస్తేనే మనసు పాడుచేసుకునేవాళ్ళను నేనెక్కడా చూడలేదు. అయినా దీనికీ భోజనానికీ సంబంధం ఏమిటి ? లేచి కాస్త మజ్జిగన్నమయినా తిను" అతడింకా మంచందగ్గరే నిలబడ్డాడు.

"నేను తినలేనండీ" తలెత్తిచూసి మళ్ళీ పడుకుంది. ఆమె చూపులు వేటగాడి దెబ్బతిన్న పక్షిలా ఉన్నాయి.

"నీవు తినలేవు. సరే బాగానే ఉంది. మరి-నాకు పెట్టటానికేం? లేచి పెట్టు. నీవు పెట్టకపోతే నేను తినను."

"అబ్బా! ఏమిటీ పట్టుదలా?" కనుబొమ్మలు ముడిచి మెల్లగా లేచింది. అంతలో అతడు పళ్లేలుపెట్టి మంచినీళ్లు పెట్టాడు.

"ఇదేమిటి? రెండెందుకు ?"

"ఒకటి నాకు - ఒకటి నీకు"

"అయ్యో, నేను తినలేను"

"ఒంటరిగా నేనూ తినలేను" చెయ్యి పైకి పెట్టుకుని పీటమీద అలాగే కూర్చున్నాడు.

చిన్నబుచ్చుకున్న ముఖంతో ఆమె రెండు పళ్లేలల్లో వడ్డించింది.

ఇద్దరూ భోజనాలయ్యాయనిపించుకున్నారు.

ఆమె ఆ సన్నటి వెలుతురులో కళ్లు చీలికలు చేసుకుని కప్పువైపు చూడనారంభించింది.

పుండరి పక్క దులుపుకుని పడుకున్నాడు. అతడికళ్ళింకా మూతపడలేదు. కస్తూరిని గురించి ఆలోచిస్తున్నాడు.

అంతలో కస్తూరి కెవ్వున కేకలేసింది.

ఒక్క ఉదుటన లేచి 'కస్తూరీ ఏమయింది?' అంటూ వచ్చి ఆమెమంచం మీద కూర్చుని "ఎందుకో భయపడుతున్నావు. బాధపడుతున్నావు. నేనిక్కడే కూర్చుంటాను నీవు నిద్రపో" తల నిమురుతూ కూర్చున్నాడు.

కస్తూరికి కొంత ధైర్యం వచ్చినట్లయింది. కళ్లుమూసుకుంది గాని మనసు గతంలోకి అడుగులువేస్తూ పోయింది.

"మణీ, నీ తల్లో పూలు మంచి వాసన వేస్తున్నాయి ఎక్కడివి?" రెండు చేతులతో మణి తలపట్టుకుని వాసనచూసింది కస్తూరి.

"మా యింట్లో పూసినవే. అమ్మ దండకట్టింది."

"నా కిటువంటి పూలంటే ఎంత ఇష్టమో చెప్పలేను."

"అయితే మీ అమ్మను కూడా మల్లెచెట్టొకటి వేసి పెంచమను."

"సర్లే. మాకే ఉండటానికి చోటులేదుగాని-పూలచెట్టు పెంచటం కూడానా? మీకంటె అంత పెద్ద పెరడుంది కనుక ఎన్ని చెట్లయినా పెంచవచ్చు"

"పోనీలే. రేపటినుంచీ నా దండలో కొంతభాగం నీకిస్తాను. పూలకోసం అంత బాధపడతావేం?" భుజమ్మీద చెయ్యేసింది మణి స్నేహంతో.

"ఈ పరీక్షలయితే నీవెక్కడుంటావో నేనెక్కడుంటానో? మీ నాన్నకు ట్రాన్స్ఫరు అవుతుందన్నావు?"

"ఏమోమరి. అయితే కావచ్చు. ఇక్కడున్నంతవరకూ మన స్నేహానికి ప్రమాదం రాదు. మనం విడిపోము. సరేనా?"

కస్తూరి నవ్వులో మణి నవ్వు కూడా కలిసేటప్పటికి గొల్లున నవ్వినట్లయింది.

ఆ మరునాడు కాలేజికి వచ్చిన మణి అటూఇటూ చూసింది కస్తూరికోసం. కొంచెం ముందరగా వెళ్ళిననాడు కాలేజి కాంపౌండులో ఎడమపక్కగా ఉన్న చెట్టుకింద కూర్చుంటుంది పుస్తకం పట్టుకుని కూనిరాగాలు తీస్తూ కస్తూరి.

"కస్తూరీ. ఇక్కడున్నావా? ఇదిగో నీకోసం పూలదండ తెచ్చాను" వాసన చూపిస్తూ కస్తూరి చేతికిచ్చింది.

కస్తూరి దేహచ్ఛాయ నలుపే. కాని చూపులకు అందంగా కనబడుతుంది, కళ్ళు అంత విశాలమైనవి కావుగాని - ఆ కళ్లల్లో ఒక వింతకాంతి తళుక్ తళుక్ మంటుంది. ఎదుటివారికి చూడగానే ఆకర్షించేవి ఆ కళ్లే. ఆమె నాసికకూ సంపంగిపూవుకూ ఎక్కడా పోలికలేదుగాని - నిండైన ఆ చెంపలమధ్య ఒదిగి కొనతేలి వుంటుంది. గడ్డానికి ఎడమవైపుగా ఉన్న పుట్టుమచ్చ చామనఛాయతో నిగనిగలాడే ఆ ముఖానికి అందాన్ని తెచ్చిపెట్టింది.

"కస్తూరీ! అందాలభామా?" ఆమె బారెడు జడను చేతిలోకి తీసుకుని మెలికలు తిప్పుతారు స్నేహితులు.

"నల్లటిదాన్నని ఆక్షేపణ చేస్తున్నారుకదూ? నేనేంచెయ్యను? బ్లీచ్ చేయించుకోనా?" ఏడుపుముఖం పెడుతుంది కస్తూరి.

"ఇప్పుడు మరీ అందంగా ఉన్నావు. ఆఁ....అలాగే ఉండు. కదలకు. ఆఁ....కొంచెం ముఖం పైకెత్తమ్మా" అంటుంది మరొక సహాధ్యాయిని పరుగెత్తుకుంటూ వచ్చి.

"ఎందుకు? ఫోటోతీస్తావా? అందమైన మా కస్తూరికి దిష్టి తగులుతుంది" మరొక తోటి విద్యార్థిని కస్తూరిని చెయ్యిపట్టుకుని లాగుతుంది.

గంట మోగుతుంది అంతలో. మగపిల్లలు ఒకవైపూ - ఆడపిల్లలు ఒకవైపు గుంపులు గుంపులుగా లోపలికి నడుస్తారు.

"ఇవాళ కనకాంబరాలూ మరువం కలిపి కట్టిన దండ తెచ్చావు. ఇది నాకెంతో ఇష్టమని నీకెట్లాతెలుసు మణీ?" ఆమెచేతిని గట్టిగా పట్టుకుని నడుస్తోంది కస్తూరి.

కాలేజినుంచి ఇంటికి రాగానే మణికి బజారుకు వెళ్ళాల్సిన పని తగిలింది. అర్జెంటుగా బట్టలదుకాణానికి వెళ్ళి రెండు రెవికబట్టలు తీసుకురమ్మంది తల్లి. మణి బయలుదేరుతుంటే తోడుగా కస్తూరి కూడా వెళ్ళింది.

ఐదారు దుకాణాలు తిరిగారు. మణికి కావలసిన రంగుల్లో జాకెట్ బట్టలు దొరకలేదు. ఇంకా ఇంకా ముందుకు పోతున్నారు. నేల ఈనినట్టు జనం. ఆ జనంలో ఇద్దరూ కబుర్లుచెప్పుకుంటూ నడుస్తున్నారు.

"ఎనిమిది కావస్తోంది మణీ, ఎన్ని దుకాణాలు తిరిగినా నీవు మెచ్చిన బట్టలు దొరకలేదు. చీరెలయినా కాదు ఇంకా తిరగటానికి" కస్తూరి మందలిచ్చి నట్టుగా అంది.

"పోనీలే కస్తూరీ! అమ్మ అసలు బైటికి ఎక్కువగా పోనివ్వదు. ఈ పేరు మీద పంపించింది. కాసేపు సరదాగా తిరుగుదాము. ఇలాంటి రద్దీ రోడ్లమీద కబుర్లుచెప్పుకుంటూ నడవడమంటే నాకెంతో సరదా. ఈ శ్రీనివాసులు దుకాణంలో జాకెట్ పీసులు కొనేద్దాం. ఆ బండీమీద మిరపకాయబజ్జీలు కొని తింటూ ఇంటికి పోదాం." మణికి ఇంకా తిరగాలని సరదాగా ఉంది.

మరో పావుగంటకు ఇద్దరూ తిరుగుముఖం పట్టేరు.

కస్తూరి చేతివాచి చూసుకుంది. "అబ్బో. తొమ్మిదయింది. మా అమ్మ చేత ఇవాళ చివాట్లు తప్పవు."

"నేనదే ఆలోచిస్తున్నా. ఇంత ఆలస్యమైంది. కనుక కూరగాయలు కొనుక్కొని ఇంటికి తీసుకుపోతే అమ్మ కోపమంతా క్షణంలో మాయమవుతుంది."

"పద ఈ సందులోనుంచి వెళితే కాస్త చీకటిగా ఉన్నా తొందరగా వెళ్ళిపోతాం."

మసకవెలుతురులో సైకిళ్ళూ, రిక్షాలూ ఆ సందులో నడుస్తునే ఉన్నాయి. ఒకటీ రెండు ఆటోలు పరుగులు తీస్తున్నాయి.

కథా నిలయం
3561
శ్రీకాకుళం



మణీ, కస్తూరీ చేతులు పట్టుకుని నడుస్తున్నారు. ఇద్దరి చేతుల్లో సంచులు ఉన్నాయి. మాట్లాడకుండా నడుస్తున్నారు.

ఒక ఆటో ఆ సందు మొదట్లో ఆగిఉంది. ముగ్గురు నలుగురు తమవెనక నడుస్తున్నట్టుగా అనిపించి గబగబా అడుగులువేయటం మొదలుపెట్టారు ఇద్దరూ.

ఇద్దరో ముగ్గురో తెలియదు - గభాలున ఆ అమ్మాయిలనిద్దరినీ విడదీసి గుంజుకుంటూ తీసుకుపోయారు.

"వదలండి. వదలండి" భయంతో అరుస్తున్నారు అమ్మాయిలు. అరిచి అరిచి కీచుగొంతులు పడ్డాయి. వాళ్లను లాక్కుపోయి ఆటోలోపడేసి చెరొకపక్కా ఇద్దరు పట్టుకుని కూర్చున్నారు.

ఆడపిల్లలు అరిస్తే పదిమందీ పోగవుతారన్న అభిమానం - రౌడీలచేతుల్లో పడ్డామన్న భయం - ఏంచేస్తారోనన్న భీతావహం - ఆ యిద్దరి గుండెలూ గబగబా కొట్టుకుంటున్నాయి.

గట్టిగా కళ్ళుమూసుకున్నారు.

ఒకదానివెంట ఒకటి ఆటోలు చప్పుడు చేసుకుంటూ పరుగులుతీశాయి.

మసకవెలుతురు ప్రసరిస్తున్న చిన్న సందులోకి నడిచాయి ఆటోలు. మణినీ, కస్తూరినీ వాళ్ళ ప్రమేయం లేకుండా ఎవరో దింపారు. వాళ్ళను పూరి పాకలాంటి ఇంట్లోకి తీసుకువెళ్ళారు. ఆటోలు తిరిగి వెళ్ళాయి.

ఎవరెవరో లోపలికి వెళ్తున్నారు-వస్తున్నారు.

శవాలమాదిరిగా పడున్నారు ఆడపిల్లలిద్దరూ.

కాకుల అరుపులతో ఇటునుంచి అటు కదిలింది మణి. అప్పటికే కస్తూరి లేచి కూర్చుని కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నది

ఒకరినొకరు పలకరించుకోకుండా పెరటివైపు నడిచారు. కుండలో నీళ్ళు తీసుకుని ముఖాలు కడుక్కున్నారు. నలిగిన బట్టలను సరిచేసుకున్నారు. తల వెంట్రుకలను చేత్తో సవరించుకున్నారు. ఇద్దరూ వాకిట్లోకి వచ్చారు.

'ఇది ఏ ప్రాంతం? ఇక్కడినుంచి ఇల్లు చేరుకోవటమెట్లా ?'

ఆ యిద్దరి మనసుల్లో బయలుదేరింది ఇదే ప్రశ్న.

గడచిన రోజున ఉన్నట్లే ఇద్దరిచేతుల్లో సంచులున్నాయి. జాకెట్ పీసుల పొట్లం మణి సంచిలో ఉంది. ఇద్దరికీ అడుగులు తడబడుతున్నాయి. ఒళ్ళు నలగ్గొట్టినట్లుగా ఉంది. కాళ్లు తేలిపోతున్నాయి.

వాళ్ళు పదిబారల దూరం నడిచేసరికి అక్కడ ఒక ఆటో కనబడ్డది.

"ఆటో కావాలా ?" అడిగాడు తల పైకి పెట్టి.

కస్తూరి చూస్తూ నిలబడిపోయింది. మణి ఆలోచిస్తోంది. తమ ఇళ్ళకు దారెటో తెలియదు. ఆటోలో పోతేనే నయమనుకుని "కస్తూరీ, ఆటోలో పోదాం రా" చెయ్యి పట్టుకుని ఆపింది.

ఆటోడ్రైవరువంకే నిశితంగా చూస్తోంది కస్తూరి. ఆ కంఠధ్వని ఎక్కడో విన్నట్టుంది. అతడినికూడా ఎక్కడో చూసినట్లనిపిస్తోంది.

"మణీ, మనం ఇంకా స్త దూరం నడిచివెళ్దాంపద. ఎక్కడ నడవలేక పోతే అక్కడే ఒక రిక్షా మాట్లాడుకోవచ్చు."

మణి చేతిని విడిపించుకుని కస్తూరి ముందడుగువేసింది.

జడ విసురుకుంటూ మణి కూడా ఆమెవెంట నడిచింది. నడిబజార్లోకి వచ్చేవరకూ ఇద్దరూ పరుగెత్తినట్టుగా నడిచారు. అక్కడినుంచి రిక్షా తీసుకుని ముందు మణియింటికి వెళ్ళారు.

"నిన్న సాయంకాలమనగా ఇల్లువదలి బయలుదేరినదానవు - ఇప్పుడా ఇంటికి రావటం? ఎక్కడికెళ్ళావు? రాత్రంతా ఎక్కడున్నావు? నీకోసం రాత్రి నాన్న తిరిగి తిరిగి పదకొండుగంటలకు ఇంటికివచ్చారు తెలుసా?" మణి తల్లి సుందరమ్మ కళ్ళెర్రచేసుకుంటూ ముందుకు వచ్చింది.

"అమ్మా! మార్కెట్లోకి వెళ్ళగానే మా స్నేహితురాలు సరోజకు చాలా జ్వరంగా ఉందని వాళ్ళ తమ్ముడు కలిసి చెప్పాడు. నేనూ, కస్తూరీ చూడటానికి వెళ్ళామమ్మా. సరోజ స్పృహలోలేదు. మంచుగడ్డలు బట్టలోవేసి తలమీద పెడుతున్నారట. తలంతా తడిసిపోతుంటే ఐస్‌బ్యాగ్‌కోసం అతడు బజారుకొచ్చాడట

ఇంక మేము వెళతామని బయలుదేరగానే వాళ్ళ నాన్నగారు "చిన్నపిల్లలు ఇంత రాత్రివేళ వెళ్ళద్దని ఆపేశారు. సరోజ తమ్ముడిని మనింటికి పంపుతామన్నారు రాలేదా అమ్మా?" భయపడుతూ చేతులు నలుపుకుంటూ అన్నది మణి.

"అతడొచ్చి చెబితే నాన్న ఆ బజార్లన్నీ ఎందుకు తిరుగుతారు? ఈ కూర గాయల బుట్టతోటే వాళ్లయింటికి వెళ్ళావా?" బుట్ట చేతిలోకి తీసుకుని కూరగా యలు పట్టిచూస్తూ లోపలికి తీసుకెళ్ళింది.

"అమ్మా! నాన్నక్కూడా ఈ సంగతి చెప్పు. నాకు భయంగా ఉంది" అతికినట్టు అబద్ధంచెప్పిన మణి తల్లినిచూసి ఒణకటం మొదలుపెట్టింది.

"చెబుతాలే. ఆయన మీ నాన్న స్నేహితుడేగా ?"

ఈలోగా నాలుగిళ్ళ అవతల ఉన్న తన యింటికి చేరుకుంది కస్తూరి.

కస్తూరికి తల్లిదండ్రులూ, తమ్ముడూ ఉన్నారు. తమ్ముడు పదవక్లాసు చదువుతున్నాడు. అతడింకా పక్కమీద ముసులుతూనే ఉన్నాడు. తల్లి అన్నం వండి వంకాయలు తరిగి పొయ్యిమీదికి ఎక్కించింది.

"కస్తూరి నిన్ననగా మణియింటికి వెళ్ళి ఇంకా రాలేదు. ఎంత స్నేహ మయితే మాత్రం రాత్రిళ్ళుకూడా అక్కడే ఉండటమా ? ఏమన్నా అంటే పరీక్ష లంటుంది" తనలో తను మాట్లాడుకున్నట్టుగా సన్నగా అంటూ తల పైకెత్తేసరికి తండ్రికెదురుగా కస్తూరి నిలబడిఉంది.

"నీ స్నేహితురాలు రానిచ్చిందా తల్లీ?"

కస్తూరికి నోట మాటరాలేదు.

"ఈ భయం నీకు నిన్న ఉండాల్సింది. ఇంటికి వచ్చినతరువాత నా ముందర ఎందుకే భయం ? పద. స్నానంచెయ్యి. నీళ్ళు కాగే ఉన్నాయి" అంటోంది తల్లి.

గబగబా గదిలోకి వెళ్ళి బట్టలు తీసుకుని స్నానాలగదిలోకి వెళ్ళింది.

'జరిగిన ఘోరాలు ఈ అమ్మలకు తెలియవు. తెలిస్తే గుండెలు బాదుకుం టారు. ఎంత అమాయకులు ? వీళ్ళకు కొంచెమయినా అనుమానం కలిగినట్టు లేదు. లోకంలో జరుగుతున్న దుర్మార్గాలను ఊహించనైనా ఊహించరే?

కస్తూరి ఆలోచనలకు అంతులేకుండా ఉంది. కన్నీళ్ళు కారిపోతున్నాయి.

''కస్తూరీ. ఇంత సేపు స్నానంచేస్తున్నావేమిటి ? తమ్ముడు స్నానంచేసి భోజనం చెయ్యాలి. స్కూలుకు వేళవుతోంది'' తలుపు తట్టింది తల్లి.

''అదేమిటే కళ్ళు అంత ఎర్రగా ఉన్నాయి ?'' కస్తూరి బైటికి రాగానే తల్లి ఆమె ముఖంలోకి చూసింది.

''సబ్బు కళ్ళల్లోకి పోయిందమ్మా'' కళ్ళుఒత్తుకుంటూ గదిలోకి నడిచింది.

రాత్రి భోజనం లేదు. కడుపులో ఆకలిబాధ. శరీరమంతా నలగ్గొట్టినట్టు నొప్పి - మనసునిండా భయం - ఆందోళన. ఏదో ప్రాణసమానమైనది పోగొట్టు కున్న బాధ - దుఃఖంతో గిలగిల్లాడిపోతున్నది కస్తూరి.

"ఈ విషయం ఎవరి చెవికైనా పడితే ? ఏవయినా వదంతులు ప్రబలితే ? కన్యబ్రతుకు ఎట్లా తెల్లవారుతుంది ?"

"కస్తూరీ. భోజనానికి లేమ్మా. ఇవాళ కాలేజికి వెళ్లవా ?"

''ఆలోచిస్తానమ్మా. రాత్రి వాళ్లయింట్లో భోజనం, నిద్రా సరిగా లేవు" భోజనంచేసి మంచమ్మీద ఒరిగిపోయింది.

ఆమె కళ్లుతెరిచేసరికి చీకటి చీకటిగా అనిపించింది.

''అమ్మా, గంటెంత ?''

''ఆరు కావచ్చింది"

"ఇంకా తెల్లవారినట్టులేదు. ఇంకో గంట పడుకోనీ. అప్పటికీ లేవకపోతే లేపు" అంటున్నాడు తండ్రి.

కస్తూరి పక్కకు తిరిగింది.

తల్లి బిగ్గరగా నవ్వినట్టు వినిపించింది.

''రాత్రి కావచ్చింది. నీకింకా నిద్ర సరిపోలేదా ? లేచి చన్నీళ్ళతో ముఖం కడుక్కో. నాన్న ఆఫీసునుంచి వచ్చి ఇంకా పడుకోవటమేమిటి లేప మంటున్నారు. ఇప్పుడైనా లే" మందలించింది తల్లి.

దిగ్గునలేచి ముఖంకడుక్కుని తల్లి యిచ్చిన కాఫీగ్లాసందుకుంది కస్తూరి. పక్కకు తిరగ్గానే ఎదురుగా తండ్రి.

తండ్రిని చూడగానే కస్తూరిలో ఒణుకు మొదలైంది.

"ఎక్కడికి వెళ్ళావు రాత్రి?"

కస్తూరి చేతిలో గ్లాసు కిందపడిపోయింది.

''నన్ను చూస్తేనేనా అంత భయం? రాత్రిళ్ళు బజార్లు తిరగటానికి భయంలేదూ?" ఆయన అక్కడే నిలబడి ఆమెను నిశితంగా పరిశీలన చేయటం మొదలుపెట్టాడు.

తల్లికి చెప్పిన కథంతా తండ్రికి చెప్పింది.

"చీకటి పడగానే ఇంటికిరావలసిన పిల్లలు చీకట్లో బజార్లుతిరగటమేమిటి? అమ్మకు చెప్పే వెళ్ళావా ?" నిలదీశాడు.

"మణి ఇంటికే గదా అని నేనే వెళ్లమన్నాను. ఇద్దరూ ఎటో వెళతారని నాకేంతెలుసు?"

"చిన్నపిల్లలను చీకటిపడేవేళ ఇల్లుకదలనిచ్చిన నిన్ను అనాలి. అనాలో చిత్రమైన పనులు చేయటం - తరువాత ఏడవటం" గిరుక్కున వెనక్కుతిరిగాడు.

కస్తూరి గుండె గుభేలుమన్నది. అంతా తెలిసినట్టూ-చూసినట్టూ మాట్లాడుతున్నాడే? చూచాయగా తెలిసిందా? లేక ఊహించాడా? ఇవాళ కాకపోతే రేపైనా పసిగట్టగలిగినవాడే నాన్న!

కస్తూరి మనసులో ఆలోచనలు వలయాలుగా తిరుగుతున్నాయి.

నాలుగునెలల క్రిందట జరిగిన పెళ్ళిచూపులలో మూడువంతులు నిశ్చయమైనట్లేననుకున్నారు. ఈ సంగతి వింటే వెనక్కుపోతారేమో? ఆ పెళ్ళికొడుకు ముందుగానే 'మగపిల్లల కాలేజిలో ఎందుకు చదివిస్తున్నార'ని అడిగాడట. ఈ రోజుల్లో మగపిల్లలకు అనుమానాలెక్కువ.

తెల్లవారిచప్తే కాలేజికి వెళ్ళాలా వద్దా అన్న సమస్య ఎదురవుతుంది.

కస్తూరి గుండెల్లో రాయిపడినట్లయింది.

తనవల్ల ఈ తప్పు జరిగినట్టుగా కుంచించుకుపోతోంది. మనసులో మథన పడుతోంది.

పగలు నిద్రపోయిన తరువాత - రాత్రి సరిగా నిద్రపట్టలేదు. కళ్ళు తెరుచుకునే ఉంది. చీకట్లో చూస్తే ఏముంటుంది? జరిగిన విషయాలే కళ్ళకు కనబడటంతప్ప? ఉన్నట్టుండి ఉలికిపాటు. కళ్లుమూస్తే కలతనిద్ర- అబ్బా. ఈ యమయాతనకు అంతమెప్పుడు?

తెల్లవారి తల్లి అడగనే అడిగింది. "అమ్మాయీ కాలేజికి వెళ్లవా ? ఇంకా అట్లా కూర్చున్నావు ?"

"అక్కడ క్లాసులు కావటంలేదమ్మా. పరీక్షలు దగ్గరకొచ్చాయి. కాలేజికి ఎవరూ సరిగా రావటంలేదు."

సాయంత్రపువేళ మెల్లగా నడిచి మణిఇంటికి వెళ్ళింది.

"మణి లేదమ్మా. వాళ్ల నాన్నగారితో ఊరికివెళ్ళింది" మణితల్లి తలఎత్తకుండా జవాబిచ్చింది.

"పరీక్షలముందర ఊరికెళ్ళిందా ?"

"మావాళ్ళింట్లో పెళ్ళి, నేనూ రేపు వెళ్తున్నాను"

"నాతో ఒక్కమాటయినా చెప్పలేదు."

"వ్యవధి లేదమ్మా చెప్పటానికి" ముఖం తిప్పుకుంది.

ఆరోజు ఆమెమాటలు కస్తూరిదే అంతా తప్పన్నట్టుగా ఉన్నాయి. కస్తూరికి చికాకూ దుఃఖమూ ముంచుకువచ్చాయి. ఈమెకంతా తెలిసిందా ? అందులో తన తప్పేముంది ?

కస్తూరి గిరుక్కున వెనక్కు తిరిగింది.

ఆమె ఇంట్లోనే చదివి పరీక్ష రాయాలనుకుంది. కాని తల్లి తమ్ముడికి చదువుచెప్పమనీ, ఇంట్లో పనులు చేయమనీ పుస్తకం పట్టనీయలేదు. తండ్రి బలవంతమ్మీద పరీక్ష రాసింది. ఫలితాలు తెలిసిననాడు ఆమెకు ప్రాణం ఉసూరుమంది.

"పోనీ సెప్టెంబరుకయినా రాయగలదా ?"

పదిరోజులతరువాత కస్తూరికొక ఉత్తరం వచ్చింది. తనకు ఒక ఇంజనీయరుతో పెద్దకట్నమిచ్చి తండ్రి తిరుపతి కొండమీద పెళ్ళిచేసి రూర్కేలా పంపించేశాట్ట. కస్తూరిని కూడా పెళ్ళిచేసుకోమని సలహా ఇచ్చింది మణి.

రోజులు గడుస్తున్నాయి. సెప్టెంబరులో కస్తూరి పరీక్షరాసి నెగ్గింది. మళ్ళీ చదువు సాగుతుందో లేదోనన్న బెంగ.

ఆ రాత్రి గదిలో తల్లిదండ్రీ ఘర్షణపడుతున్నారు.

"ఏదో ఒక సంబంధం సెటిల్ చెయ్యండి. కాలం గడిపేస్తున్నారు." తాత్సారం చేయకుండా వెంటనే పెళ్ళిప్రయత్నాలు చేయండి.

"ఎట్లా వస్తాయే సంబంధాలు? కాలేజీ గోడలమీద ఏం రాసిఉందో చూశావా ఎప్పుడయినా? ఆ రాతలు అందరు చదివే ఉంటారు. ఆ కాలేజిలో చదివింది అమ్మాయి అనగానే సంబంధాలు వెనక్కుపోతున్నాయి. ఈ మాట నీతో చెప్పలేక తప్పించుకు తిరుగుతున్నాను.

తల్లి "అయ్యో, ఇంకెలా ? పెళ్ళెట్లా అవుతుంది నా కూతురికి ?" అని ఏడవటం మొదలుపెట్టింది.

తల్లి అట్లా మానసికంగా అలిసిపోతే ఫిట్సు వస్తాయి. "నామూలంగా తల్లికి ఫిట్సు వస్తాయేమో ? ఈ దెబ్బనుంచి తేరుకోవటం కష్టమే." కస్తూరి కుప్పలా కూలిపోయింది.

రోజులు నెలలుగా, సంవత్సరాలుగా మారిపోతున్నాయి. కస్తూరితమ్ముడు వెటర్నరీ డాక్టరయ్యాడు. ఉద్యోగం వచ్చింది. అప్పుడు తల్లిదండ్రులిద్దరూ మళ్ళీ ఘర్షణపడటం మొదలుపెట్టారు.

"వాడికి పెళ్ళిచేసి ఉద్యోగానికి పంపాలి గాని పెళ్ళిచెయ్యకుండా పంపటం నాకిష్టంలేదు" తల్లి పట్టుపట్టింది.

"దానికి చెయ్యకుండా వాడికి ఎట్లాచేస్తాం? నీవూ ఆలోచించు"

ఆమె పోరు పడలేక తన మిత్రుడిని సలహా అడిగాడు కస్తూరి తండ్రి.

"చూస్తాను. నీవు ఇవ్వగలిగిన కట్నానికి వచ్చేవాడున్నాడేమో చూస్తాను"

మిత్రుడు వెతికివెతికి ఒక సంబంధం తీసుకొచ్చాడు.

కస్తూరి తనను చూడటానికి వచ్చిన పెళ్ళికొడుకును కళ్ళెత్తి చూసింది. కడుపులో తిప్పినట్లయింది. చటుక్కున చూపులు తిప్పేసుకుంది.

పెళ్ళిచూపులకు వరుడితోకూడా వచ్చినవాళ్ళు మాటల్లోపడ్డారు. పెళ్ళికొడుకు చాలా గంభీరంగా ఉన్నాడు.

కస్తూరి తల్లిదండ్రులు అనాసక్తంగా ఉన్నారు. ఈ తతంగము ఎప్పుడు పూర్తవుతుందా అని చూస్తున్నారు. పెళ్ళికొడుకుతో వచ్చినవాళ్ళు కట్నకానుకల ప్రసక్తి తీసుకువచ్చారు.

"మా అమ్మాయికూడా చదువుకుంది. ఉద్యోగంచేసి డబ్బుసంపాదిస్తుంది. అన్నిటికంటె మీరు గ్రహించాల్సింది మా అమ్మాయి అందగత్తె. నేను ఐదువేలకంటె ఒక్కరూపాయి కూడా ఇవ్వను"

"సరే మీరంత ధీమాగా మాట్లాడితే మేమేనా తక్కువతిన్నది? మాకు దొరకవా సంబంధాలు'' వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి తల్లిదండ్రీ మళ్ళీ ఘర్షణ. "'దీనికి పెళ్ళెట్లా" అంటూ బాగా ఘర్షణపడ్డారు. ఒక నిర్ణయానికి రాకుండానే నిద్రపోయారు.

కస్తూరికి బాగా అర్థమైంది. తను నాన్నకూ, అమ్మకూ కూడా చాలా భారంగా ఉన్నట్టు స్పష్టమైంది. తను వాళ్ళగుండెలమీద కుంపటి. వయసుమళ్ళిన కన్నవారికి ఇదో పెద్ద సమస్య. ఛీ, అడ్డబతుకు !

ఈ సమస్యను ఒకవిధంగా తను పరిష్కరించగలదు. ఈ చదువుతోటే తనేదయినా ఉద్యోగం సంపాదించుకోగలదు. తన కాళ్ళమీద తాను నిలబడగలదు. ఏ ఊరయినా వెళ్ళి చదువుకుంటూ ఉద్యోగం చేయగలదు. కాని తను దురదృష్టవంతురాలు. ఒకసారి దౌర్జన్యానికి బలి అయిన తరువాత తన జీవితమంతా ఆ మచ్చ వెన్నాడక మానదు. జీవితం కుక్కలుచింపిన విస్తరవుతుంది.

అందుకని జీవితంతో రాజీపడాలా అతడిని పెళ్ళిచేసుకుని ?

రెండు రాత్రులు నిద్రాహారాలు లేకుండా ఒకటే ఆలోచన. చివరకు ఆమె

ఒక నిర్ణయానికి వచ్చింది. ఎం.ఏ పరీక్షకు కావలసిన పుస్తకాలు తెప్పించుకుని ఇంట్లోనే చదివింది. పరీక్ష ఆ ఊళ్ళో రాయలేదు. తండ్రి వెంబడి పెట్టుకుని వెళ్ళి మరొకచోట రాయించాడు. రెండేళ్ళు కష్టపడి చదివినందుకు క్లాసు తెచ్చుకుంది.

"నాన్నా, మనింటిదగ్గరే ఒక స్కూలుంది. నేను టీచరుగా చేరనా?"

అతడి కనుబొమ్మలు ఆత్మీయంగా కలుసుకున్నాయి.

"చూడు కస్తూరీ. అమ్మకు ఆరోగ్యం బొత్తిగా చెడిపోయింది. తమ్ముడికి పెళ్ళిచెయ్యమని ఒత్తిడి చేస్తోంది. ఆ బాధ పడలేక ఒక సంబంధం సెటిల్ చేశాను. శ్రావణంలో పెళ్ళి. అమ్మకు నిన్నుగురించే బెంగ. నీకు ఉద్యోగంకంటె పెళ్ళి ముఖ్యమని అంటుంది."

"అదా నాన్నా అమ్మ బెంగ? నేను ఏంచేస్తే ఆ బెంగ తగ్గుతుందో చెప్పు. చేస్తాను. నిప్పుల్లో దూకమంటుందా? దూకుతాను ఆమె తృప్తిపడుతుందంటే."

ఆతడు వంచిన తల ఎత్తలేదు.

తెల్లవారి లేస్తూనే కస్తూరి తల్లిదగ్గర కెళ్ళి అమ్మా అని పిలిచింది.

"ఏం తల్లీ. రాత్రి నిద్రపోయినట్టులేదు. నీ ముఖం పీక్కుపోయింది. ఏడ్చావా ?" కళ్లుతెరిచి తల నిమిరింది.

"నా ఏడుపుకేమిటి? నీ సంగతి చెప్పు? నేను పెళ్ళిచేసుకుంటే నీకు బెంగ తగ్గుతుందని నాన్న అంటున్నాడు. అదే నిజమయితే ఎవడినయినా తీసుకువచ్చి మూడుముళ్ళు వేయించు—అదీ తమ్ముడి పెళ్ళికాకముందు. త్వరగా ప్రయత్నాలు చేయండి."

తండ్రి తిరిగితిరిగి కస్తూరికి వికారపెట్టిన సంబంధమే మళ్ళీ చూశాడు, ఈసారి మర్యాదగా మాట్లాడాడు. కస్తూరి పట్టుదల మీద గుడిలోచ పెళ్ళి జరిగి పోయింది పదిరోజులలోపల.

పెళ్ళికాగానే కస్తూరి భర్తతో చెప్పింది తలఎత్తకుండా.

"మీరు ఈ ఊరినుంచి బదిలీ చేయించుకోండి."

ఆ ఊరికి రావాలని ఎందరో ప్రయత్నాలు చేస్తున్నారు. అందుచేత బదిలీ సులభంగా అయింది.

కస్తూరి తలవంచుకునే ఇంటిపనులు చేస్తోంది. పుండరికి వంటచేసి పెడు తోంది. కాని- తలఎత్తి అతడి ముఖంలోకి చూడలేదు.

ఆ ఊరు కొత్త కస్తూరి చదువుకున్నదని తెలియగానే విద్యార్థులు ట్యూషన్ చెప్పమని వచ్చారు. బి. ఏ. చదివేవాళ్ళూ, ఇంటర్ చదివేవాళ్ళూ, పదోక్లాసు పిల్లలూ స్ట్రైకులవల్ల పోర్షను కాలేదని, పరీక్షలు దగ్గరికి వచ్చాయని బ్రతిమి లాడటం మొదలుపెట్టారు.

"విద్యను దాచుకోకూడదు. దానంచెయ్యాలి. వాళ్ళకు సహాయం చెయ్యి" పుండరి నోటిమీదుగా వచ్చిందీ మాట - ముఖం పక్కకు తిప్పుకుని తనకు కొంత కాలక్షేపం అవుతుందని కస్తూరి అంగీకరించింది. ఇంటిపనులు తొందరగా ముగించు కొని ఉదయం రెండు బాచెస్, సాయంత్రం రెండు బాచెస్‌గా విడదీసి చెప్పేది. ఆ సంవత్సరం పరీక్షకు వెళ్ళినవారందరూ నెగ్గారు. మరుసటి సంవత్సరం కూడా చాలామంది వచ్చారు ట్యూషన్‌కి.

వయసుమళ్ళిన ఆడనౌకరును పెట్టుకుని కస్తూరి ఇంటిపనులూ, ట్యూషన్లు చెప్పటమూ కాలక్షేపంగా జీవితాన్ని గడుపుతోంది.

ఆమెకు జీవితంలో ఆశలు లేవు. ఆశయాలు అంతకంటె లేవు. ఉత్సాహం చచ్చిపోయింది. తల్లీ, తండ్రీ తమ్ముడూ ఇప్పుడామె మనసులోనుంచి మరుగై పోయారు. తల్లి ఆరోగ్యమెట్లాఉందో? తండ్రి రిటైరయ్యాడో? ఆ జీవితానికి తెర పడిపోయింది.

వాళ్ళు రాసిన జాబులు వాళ్ళకే తిరిగి వెళ్తున్నాయి.

విద్యార్థులతోడిదే లోకమనుకున్న కస్తూరి జీవితంలో హఠాత్తుగా ఒక సంఘటన జరిగింది. భోజనానికి అంతా సిద్ధంచేసుకుని పుండరికోసం ఎదురు చూస్తున్న కస్తూరికి అతడు రాత్రి పదిగంటలయినా యింటికి రాకపోయేసరికి తల మీద పిడుగుపడినట్లయింది. తెల్లవారేవరకూ కూర్చున్నది కూర్చున్నట్టుగానేఉంది. ఆఫీసుకు ఒక విద్యార్థిని పంపించింది. ఆ క్రిందటిరోజు కూడా అతడు ఆఫీసుకు రాలేదని తెలిసింది.

కస్తూరి హృదయం సముద్రమంత గంభీరమైంది. పైకి నిబ్బరంగా పిల్ల

లకు పాఠాలు చెప్తున్నది. ఇరుగుపొరుగు స్త్రీలతో తొణకకుండా మాట్లాడుతున్నది. అడిగినవాళ్ళకు పుండరి తన తల్లిని చూడటానికి వెళ్ళాడని చెప్తోంది.

పగలు పైకి కనబడుతున్న గాంభీర్యం రాత్రిళ్ల సడలిపోతున్నది. ఎంత ఆలోచించినా ఒక తీరానికి చేరుకోలేకపోతున్న దామె మనసు. తన జీవితంలో ఎన్ని మలుపులు ?

ప్రతి ఉదయం సూర్యుడు ఉదయిస్తూనే ఉన్నాడు. సాయంత్రము అస్తమిస్తూనే ఉన్నాడు. ఋతువులు వాటి ధర్మాలను నెరవేర్చుకుంటూ పునరావృత మవుతున్నాయి.

పుండరిని గురించి ఆమె హృదయం లోలోపల ఘోషిస్తున్నది. తనవల్లనే పుండరి ఇంట్లోనుంచి వెళ్ళిపోయాడు. ఎంతకాలమని తలఎత్తి చూడని భార్యతో జీవితం గడుపుతాడు ? ఆదరించని భార్య తనకెందుకనుకున్నాడు ? అందుకనే చెప్పకుండా వెళ్ళిపోయాడా ? అంతే-అంతే.

పెరట్లో చాపమీద కూర్చుని తనవెంట తెచ్చుకున్న నవల ఒకటి చదువుతోంది కస్తూరి. సాయంత్రపు నీరెండ ఆమె ముఖమ్మీద పడుతోంది. నౌకరు గడపముందర కూర్చుని కునికిపాట్లు పడుతోంది.

ఆమె చదువుతున్న నవల కస్తూరి జీవితానికి దగ్గరగా ఉంది. ఎంతో సారూప్యముంది. ఆమెకు తెలియకుండానే కన్నీళ్లు కారిపోతున్నాయి.

తలుపు తెరిచిన నౌకరు గడపలో నిలబడిన వ్యక్తిని చూసి ‘‘మీ పేరు చెప్పండి. అమ్మగారికి చెప్తాను” అంటోంది. అతడు వినిపించుకునే స్థితిలోలేడు. ఆమెను తోసుకుంటూ పెరట్లోకి వచ్చి కస్తూరి ముందర నిలబడ్డాడు.

గ్రేకలర్ సూటు - నిగనిగలాడే బూట్లు - కళ్ళకు మిలమిల మెరిసిపోయే కళ్లజోడు. అతడిని చూసి బిత్తరపోయి దిగ్గునలేచి నిలబడ్డది కస్తూరి. ఆమెకు నోట మాటలేదు. దిగ్భ్రాంతిగా ఉంది.

“కస్తూరీ, ఒక ఏడాదికే మనిషిని మర్చిపోతావా ? లేక నీకు చెప్పకుండా వెళ్ళానని మూగనోము పట్టావా? ఇంతకాలం నిన్ను క్షోభపెట్టి నేను నరకం

అనుభవించాను. ఒక డాక్టరు సలహాతో నీకు చెప్పకుండా వెళ్లాను. తిరిగివచ్చి నిన్ను సంభ్రమపరుద్దామనుకున్నాను. ఇప్పుడైనా నా ముఖం చూస్తావా?" ఆమెను కూర్చోబెట్టి తనూ ఆ చాపమీదనే కూర్చున్నాడు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

అతడికి కొత్తగా ఉంది తను తీసుకుంటున్న చొరవకు,

తను చేసిన పనికి కస్తూరి కుమిలిపోయింది. చీలిన అతడి పెదవినీ-ఆ నోటినీ చూడలేక తను తలఎత్తకుండా అతడితో ఒక్కమాటయినా మాట్లాడకుండా గడిపింది. ఇంతకాలమూ తనవంటిదానికి అంతటి సహృదయుడు లభించటం ఎంత అదృష్టం ?

"కస్తూరీ, గతంలోకి వెళ్లకు. నీ చేతివంట రుచిచూసి ఎంతకాలమైందో ననిపిస్తోంది. ఆకలి మండిపోతోంది. భోజనంచేద్దాంలే. అన్నట్టు అసలు వంట చేశావా ?"

ఎన్నిమాటలు ? ఎంత ఆప్యాయత ? అసహ్యించుకున్న భార్యమీద ఎంత మమత ? కస్తూరి కరిగిపోతున్నది.

అతని చేతిని ఆసరా చేసుకుని లేచిన కస్తూరి తడబడేకాళ్ళతో వంటింట్లోకి వెళ్ళి ఇద్దరికీ పళ్ళేలలో వడ్డించింది. ఊరగాయ కొసరికొసరి వడ్డించింది.

ప్లాస్టిక్ సర్జరీవల్ల అతడి ముఖానికి ఎంత అందం వచ్చింది ? కళ్ళార్పకుండా అతడి ముఖాన్ని చూస్తూ ఆకలి మరిచిపోయింది కస్తూరి.

అతడు విరగబడి నవ్వుతున్నాడు.

ముందు భోజనం కానీ. నీకు చెప్పాల్సింది చాలా ఉంది. తెల్లవారితే నాకాఫీసు - నీకు ట్యూషను."

"నేను గ్రహించుకున్నాను" అన్నది కాని ఆమె ముఖం వెలవెలబోయింది. ప్లాస్టిక్సర్జరీ పేరున ఊరికివెళ్ళి కాలేజి గోడవ్రాతలు చదివి వచ్చాడా ? ఇప్పుడు తనేంచెయ్యాలి ?